క్లుప్తంగా

రైతులను విస్మరించిన ప్రభుత్వాలు



మాట్లాడుతున్న పాకాల శ్రీహరి

నర్సాపూర్: రైతు శ్రేయస్సును రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విస్మరించాయని రాష్ట్ర రైతు రక్షణ సమితి అధ్యక్షుడు పాకాల శ్రీహరి ఆరోపించారు. ఆదివారం ఆయన నర్సాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమాన్ని విస్మరించాయని చెప్పారు. ప్రస్తుత ఎన్నికల్లో రైతులు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు బుద్ధి చెప్తారని అన్నారు. కాగా కాంగ్రెస్ పార్టీ రైతుల సంక్షేమం కోసం పాటుపడగలదని విశ్వాసం వ్యక్తం చేశారు. నర్సాపూర్ ప్రాంత రైతులు కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డికి అండగా ఉండాలని పాకాల శ్రీహరి కోరారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

స్వచ్ఛతే లక్ష్యం



చెట్ల పాదులను శుభ్రం చేస్తున్న యువకులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారం గ్రామంలో నేచర్ ఐకాన్ యూత్ ఆధ్వర్యంలో 291వ వారం స్వచ్ఛాభారత్ నిర్వహించారు. ఆదివారం హరితవనంలో చెట్ల మధ్య పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్త చెదారాన్ని తొలగించారు. చెట్ల పాదులను శుభ్రం చేశారు. అనంతరం చెత్త, చెదారాన్ని డంప్‌యార్డ్‌కు తరలించారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు



చండీలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌చారి

శివ్వంపేట(నర్సాపూర్): పోలింగ్ కేంద్రాల వద్ద పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌చారి అన్నారు. ఆదివారం మండలంలోని గోమారం, సికింద్లాపూర్, చండీ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆర్ఐ కిషన్‌తో కలిసి పరిశీలించారు. ఈ నెల 30న జరిగే పోలింగ్‌కు సంబంధించి ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. మండల పరిధిలో ఉన్న 55 పోలింగ్ కేంద్రాల్లో నీటి వసతి, టాయిలెట్స్, ఫర్నిచర్, విద్యుత్, ర్యాంపులు ఇతర వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

కొనసాగుతున్న తనిఖీలు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో వాహనాల తనిఖీలు కొనసాగుతున్నాయి. ఆదివారం చిన్నశంకరంపేటలో ఎస్ఎస్‌టీమ్ సభ్యులు వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో మెదక్ – చేగుంట ప్రధాన రహదారిపై వచ్చిపోయే వాహనాలను అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆదివారం హవేళిఘనాపూర్ ఎంపీపీ నారాయణరెడ్డి, కామారం మాజీ సర్పంచ్ సుధాకర్ వాహనాలను అధికారులు తనిఖీ చేశారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



చాముండేశ్వరీ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని చాముండేశ్వరి ఆలయంలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు సమర్పించుకున్నారని ఆలయ అర్చకులు తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చన నిర్వహించామన్నారు.

నల్లపోచమ్మదేవి ఆలయంలో ..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్ల పోచమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివ్వప్ప, రాజేశ్ అమ్మవారికి ఉదయం పంచామృతాలతో అభిషేకం నిర్వహించి పూజలు చేశారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు తీసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారి వెంకట్‌రెడ్డి, సర్పంచ్ సాయిలు, ఉపసర్పంచ్ మానిక్యరెడ్డి, ఆలయ ధర్మకర్తలు పర్యవేక్షించారు.

మరోసారి బీఆర్ఎస్‌నే గెలిపించాలి

- నారాయణఖేడ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): తెలంగాణ మరింత అభివృద్ధి దిశలో ముందుకు వెళ్లాలంటే తప్పనిసరిగా బీఆర్ఎస్ పార్టీనే మరోసారి గెలిపించాలని నారాయణఖేడ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పెద్దశంకరంపేటలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు పేదలకు అందించామన్నారు. ప్రజలు హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని, మరోసారి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో కేంద్ర ఎఫ్‌సీఐ మాజీ డైరెక్టర్ విగ్రాం శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ జంగం శ్రీనివాస్, జెడ్పీటీసీ విజయరామరాజు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మురళి, సీనియర్ నాయకులు వేణుగోపాల్‌గౌడ్, రైతుబంధు అధ్యక్షుడు సురేశ్‌గౌడ్, వైస్ ఎంపీపీ లక్ష్మీరమేశ్, ఎంపీటీసీలు సుభాశ్‌గౌడ్, దత్తు, స్వప్న రాజేశ్, నాయకులు కృష్ణమూర్తి, గంగాధర్‌గౌడ్, భూమేశ్వర్‌గౌడ్, మానిక్‌రెడ్డి, అయూబ్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ వస్తే భూములు పోవడం ఖాయం

- గజ్వేల్ అభ్యర్థి ఈటల రాజేందర్

మనోహరాబాద్(తూప్రాన్): బీఆర్ఎస్ వస్తే ఉన్న భూములు పోవడం ఖాయయని, కేంద్ర ప్రభుత్వం పంపిన నిధులతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమయిందని గజ్వేల్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం మండలంలోని కూచారం సర్పంచ్ జక్కిడి నరేందర్‌రెడ్డి, కోనాయపల్లి(పీటీ) సర్పంచ్ ప్రభావతి, నాయకులు చంద్రశేఖర్, కోండాపూర్ సర్పంచ్ చింతల మమతరవిలతో పాటు ఎమ్మార్పీఎస్ నాయకులు మురళి, పలు గ్రామాల వార్డు సభ్యులు, నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఈటల వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలు బీజేపీ బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షుడు మల్లేశ్, బీజేపీ మండలాధ్యక్షుడు నరేందర్‌చారి, పార్లమెంట్ కన్వీనర్ రామ్మోహన్‌గౌడ్, సాయిబాబా, వెంకట్‌గౌడ్, సాదు నర్సింలు, మల్లేశ్, అజయ్, కిరణ్ కుమార్‌యాదవ్, నాయకులు జగన్‌గౌడ్, మనోహర్ రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ



చండీలో ఓటర్లకు స్లిప్పులు అందిస్తున్న బీఎల్‌ఓలు

శివ్వంపేట(నర్సాపూర్): ఓటుహక్కుకు సంబంధించి సిబ్బంది ఓటరు స్లిప్పుల పంపిణీ ముమ్మరంగా చేస్తున్నారు. శివ్వంపేటతో పాటు అన్ని గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఓటర్లకు బీఎల్‌ఓలు ఓటరు స్లిప్పులను అందజేస్తున్నారు. ఈ నెల 30న ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఓటరు స్లిప్పులతో పాటు ఓటర్ గైడ్, సీ – విజిల్ పత్రాలు అందజేస్తున్నారు. పోలింగ్ రోజున ఓటర్లు సిబ్బంది ఇచ్చిన స్లిప్పులతో పాటు ఎదైన వారికి సంబంధించిన గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్‌చారి సూచించారు.

ఘనంగా ఇందిరా గాంధీ జయంతి



ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

టేక్మాల్(మెదక్): మండల కేంద్రం టేక్మాల్‌లో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నిమ్మ రమేశ్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో ఆదివారం భారత తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇందిరా గాంధీ దేశ ప్రజల మనసులో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ సెంబర్ షేక్ మజహార్, పార్టీ సీనియర్ నాయకులు మాన్‌కిషన్, కిషోర్, సాగర్, సోలాపురం రాజు, గంపల యాదయ్య, దండు కాంతం, కేశిరెడ్డి, కుమ్మరి శంకరయ్య, కుమ్మరి ఎల్లయ్య, వెంకటాచారి, సాయి శేషు గౌడ్, సామెల్, మోహన్ నాయక్, షాహిద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్‌లో చేరుతున్న సర్పంచ్‌లు

పెద్దశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందని నారాయణఖేడ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజీవరెడ్డి, రాష్ట్ర యూత్‌కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేశ్‌షెట్కార్ అన్నారు. ఆదివారం సాయంత్రం పెద్దశంకరంపేట మాజీ ఎంపీపీ బాసాడ రాజు, జూకల్ సర్పంచ్ జగన్మోహన్‌రెడ్డి, రామోజిపల్లి సర్పంచ్ మంజుల అశోక్, మాజీ సర్పంచ్ రాంచందర్‌లు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు.

మైనంపల్లికి పదేళ్లకు మెదక్ గుర్తొచ్చిందా?

- ఎన్నికల ముందు వచ్చే మోసగాళ్లను ప్రజలు నమ్మరు
- మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి



బొల్లారంలో బతుకమ్మతో స్వాగతం పలుకుతున్న ప్రజలు

హవేళిఘనాపూర్(మెదక్): ఎన్నికలు వచ్చినప్పుడు ప్రజలను ప్రలోభపెట్టి మోసం చేసే వారిని ప్రజలు నమ్మరని, మైనంపల్లికి పదేళ్లకు మెదక్ గుర్తొచ్చిందా అని మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మెదక్ మండల పరిధిలోని వెంకటాపూర్, రాజ్‌పల్లి, తిమ్మక్కపల్లి, బొల్లారం, చిట్యాల, జానకంపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మాదేవేందర్‌రెడ్డికి మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. మండల పరిధిలోని బొల్లారం గ్రామంలో సర్పంచ్ వికాస్ ఆధ్వర్యంలో మహిళలు బతుకమ్మలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో పదేండ్లు పాలించిన మైనంపల్లి హన్మంతరావు కొర్విపల్లిలో దవాఖానా నిర్మిస్తానని వేసిన శిలాఫలకం ఇంత వరకు చేయలేదన్నారు. ఇప్పటి వరకు ఆయన మెదక్ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఎన్నికలప్పుడు వచ్చి ప్రజలను ప్రలోభాలకు గురి చేసి, ఎన్నికల్లో గెలుపొందాలని చూస్తున్నారని, దానిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. వారు ఎన్ని ప్రయత్నాలు చేసినా.. ప్రజలు సీఎం కేసీఆర్ చేసిన పథకాల వైపు ఆకర్షితులై తిరిగి బీఆర్ఎస్‌ను అధిక మెజారీతో గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ లావణ్యరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ అంజాగౌడ్, ఎంపీపీ యమున జయరాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, సీతారామయ్య, సర్పంచ్‌లు ఎలక్షన్‌రెడ్డి, వికాస్, వెంకటేశం, సంగమేశ్వర్, బీఆర్ఎస్ నాయకులు సాయిలు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

హవేళిఘనాపూర్(మెదక్): మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డికి మద్దతుగా మండల పరిధిలోని జక్కన్నపేట గ్రామంతో పాటు ఆయా గ్రామాల్లో ఎంపీపీ శేరి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జక్కన్నపేట ఉప సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ దుర్గారావు తదితరులు ఉన్నారు.

ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందిస్తున్న శివకుమార్‌గౌడ్

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గూడూర్ గ్రామంలో డిసెంబర్ 7న నెలకొల్పనున్న గురుపీఠం శిలాన్యాసానికి హాజరు కావాలని ఆదివారం పలువురు ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. శ్రీశైలం దత్తగిరి ఆశ్రమం మేనేజింగ్ ట్రస్టీ మాధవరెడ్డితో పాటు శిరీశ్ ఇన్ఫోసిస్ మేనేజింగ్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్, ప్రముఖ పారిశ్రామిక వేత్త వెంకటేశ్‌కు ఆహ్వాన పత్రికలను గురుపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు శివకుమార్‌గౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ గురుపీఠం ట్రస్టు సభ్యులు మోహన్‌రావు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

టేక్మాల్(మెదక్): మండలంలోని వెల్పుగొండ గ్రామంలోని పలువురి కాంగ్రెస్ నాయకులు అందోల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ సమక్షంలో ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే స్వగ్రామంలోని పోతులబోగుడలో గంధం రాజు, గంధం యేసు, గంధం కేశయ్య, నిరుడి ముత్యం, నిరుడి దేవయ్య, కట్ట వసంత్ కుమార్, ముఖింద్ రావు, బాలయ్య, దాసరి మల్లేశం తదితరులకు పార్టీ కండువేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు భక్తుల వీరన్న, వెల్పుగొండ సర్పంచ్ నారాయణ ఉన్నారు.

కాంగ్రెస్‌లోకి తండా సర్పంచ్

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని వసురాం తండా బీఆర్ఎస్ సర్పంచ్ మోతి పాండు నాయక్, పలువురు వార్డు మెంబర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మల్లేశంగౌడ్, పార్టీ నాయకుడు శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్ తరలిన బీజేపీ శ్రేణులు

పెద్దశంకరంపేట(మెదక్): నారాయణఖేడ్‌లో బీజేపీ నిర్వహించిన రోడ్ షోకు పేట బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు ఆదివారం భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ హాజరయ్యారు.

తల్లి మందలించిందని యువకుడి ఆత్మహత్య



రమేశ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): తల్లి మందలించిందని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రం చిలప్‌చెడ్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం.. చిలప్‌చెడ్ గ్రామానికి చెందిన కోర్పోల్ రమేశ్ (20) ఏ పని చేయకుండా ఖాళీగా తిరుగుతుండడంతో అతన్ని తల్లి అనిత మందగించడంతో మనస్తాపానికి గురైన రమేశ్ శనివారం గడ్డి మందు తాగాడు. దీంతో అతడిని జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రి తరలించగా, అక్కడి వైద్యులు హైదరాబాద్ తీసుకెళ్లమనడంతో హైదరాబాద్ తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ..ఆదివారం మృతి చెందాడు. మృతుడి పెద్దమ్మ రామమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కరెంట్ షాక్‌తో ఎద్దు మృతి

చిలప్‌చెడ్(నర్సాపూర్): కరెంట్ షాక్‌తో ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని రహీంగూడలో చోటు చేసుకుంది. ఆదివారం స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రహీంగూడకు చెందిన దశరథ్ ఎద్దు గడ్డి మేస్తుండగా శివారులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ తీగలు తలడంతో అక్కడికక్కడే అది మృతి చెందింది. దూడ విలువ రూ. 40 వేల వరకు ఉంటుందని దశరథ్ ఆవేదన వ్యక్తం చేశాడు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

వెల్దుర్తి(తూప్రాన్): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని యశ్వంతరావుపేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మధుసూదన్‌గౌడ్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వట్టిపు నెల్లూర్(42) శనివారం రాత్రి కల్లు తాగాడానికి బయటకు వెళ్లాడు. ఆదివారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన గ్రామస్తులు చెరువు గట్టుపై దుస్తులు, సెల్ ఫోన్ ఉండడంతో కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు చెరువులో గాలించగా నెల్లూర్ మృతదేహం లభ్యమైంది. మృతుడు శనివారం రాత్రి గ్రామానికి చెందిన కృష్ణ అనే వ్యక్తితో కలిసి కల్లు తాగాడని, అతనిపై అనుమానం ఉందని కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ మదుసూధన్‌గౌడ్ వెల్లడించారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న బాలికలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం బాలికలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఫాస్టర్ జైపాల్ ఆధ్వర్యంలో బాలికలు ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాంత, సంఘం సభ్యులు ఏసు, జ్ఞానప్రకాశ్, భూషణం, అనురాధ, జ్యోతి, సునీత, జైల్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

విజయభేరికి తరలిరావాలి

శివ్వంపేట(నర్సాపూర్): నర్సాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించే విజయభేరికి భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, సీనియర్ నాయకుడు నవీన్‌గుప్తా అన్నారు. నర్సాపూర్ ఉదయం 10 గంటలకు నిర్వహించే విజయభేరి సభకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరవుతున్నట్లు చెప్పారు. ప్రతీ గ్రామం నుంచి కార్యకర్తలు అధిక సంఖ్యలో ప్రజలను సభకు తరలించాలన్నారు.

ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని దుద్దెడ గ్రామ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. త్రీటౌన్ సీఐ భానుప్రకాశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొమురం భీం జిల్లాకు చెందిన జిట్టనేని తిరుపతి (35) లారీ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో మంచిర్యాల నుంచి బొగ్గును లారీలో హైదరాబాద్‌కు తీసుకెళ్తున్నాడు. దుద్దెడ శివారులో ముందు వెళ్తున్న లారీని బలంగా ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్ కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బీఆర్ఎస్‌కు అండగా మైనార్టీలు



నర్సాపూర్: పార్టీలో చేరుతున్న మైనార్టీ నాయకులు



కామారం తండాలో బీఆర్ఎస్ ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ మాధవి

నర్సాపూర్: రాష్ట్రంలోని మైనార్టీలు బీఆర్ఎస్ వెంట ఉన్నారని నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతా రెడ్డి అన్నారు. ఆదివారం సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డిల సమక్షంలో మున్సిపాలిటీకి చెందిన మైనార్టీ నాయకులు కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీలకు అండగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నయిమోద్దీన్, నాయకులు మహ్మద్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలంలోని కాళ్లకల్‌లో ఉప సర్పంచ్ రాజు ఆధ్వర్యంలో ముప్పిరెడ్డిపల్లిలో పెంటన్న, రాంరెడ్డిల ఆధ్వర్యంలో కొండాపూర్‌లో నూకల రాము, ఉప సర్పంచ్ వెంకట్, దండుపల్లిలో భిక్షపతి, ఉప సర్పంచ్ మహేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో కేసీఆర్ గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు జావీద్, ఇర్ఫాన్, రాహుల్‌రెడ్డి, ముస్తాఫా, బాలేశ్ తదితరులు ఉన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): ప్రజలకు మేలు చేస్తున్న బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని జెడ్పీటీసీ మాధవిరాజు కోరారు. మండలంలోని కామారంతండాలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల ఉపాధ్యక్షుడు బాగారెడ్డి ఉన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కొట్టాల గ్రామ పంచాయతీ పరిధిలోని బిట్లతండాకు చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్లం, రాయగిరి, రాజునాయక్, జవాహర్‌నాయక్, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- నర్సాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి



నర్సాపూర్‌లో ర్యాలీగా వెళ్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి, పార్టీ నాయకులు



కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువా కప్పుతున్న రాజిరెడ్డి

నర్సాపూర్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని నర్సాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సాపూర్ పట్టణంలో అభివృద్ధి కుటుపడిందని ఆరోపించారు. మురికి కాల్వలు, మౌలిక వసతులు లేక పట్టణ ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నర్సాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆవుల రాజిరెడ్డికి మద్దతుగా మాజీ ఎంపీ, సీడబ్ల్యూసీ సభ్యురాలు మీనాక్షి నటరాజన్ ఆదివారం పట్టణంలో ప్రచారం చేశారు. ఇంటింటి ప్రచారంలో మాజీ ఎంపీ మీనాక్షి నటరాజన్, యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి సంతోశ్, ఎన్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి అనులేక, నాయకులు ఆంజనేయులుగౌడ్, సుహాసినిరెడ్డి, మల్లేశ్, శ్రీనివాస్‌గుప్తా, చిన్న అంజిగౌడ్, అశోక్, ఉదయ్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వైపే ప్రజలు

హత్నూర(సంగారెడ్డి): తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో ప్రజలు విసిగిపోయి కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని నర్సాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి రాజిరెడ్డి అన్నారు. మండల కేంద్రం హత్నూర గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ సత్యవతి భర్త పేంటేశ్ బీఆర్ఎస్ నుంచి రాజిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. రెండుసార్లు కేసీఆర్‌ను నమ్మి ఓట్లేసి మూడోసారి మోసపోయి ఎందుకు ప్రజలు సిద్ధంగా లేరని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు, కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర మహిళా నాయకురాలు సువాసినిరెడ్డి, కాంగ్రెస్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి హకీం, దౌల్తాబాద్ సర్పంచ్ వెంకటేశం, నాయకులు అల్తాఫ్, పెంటయ్య, అందానగరం గోపాల్, రాములు, లతీఫ్, ఖదీర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని మహమ్మద్ నగర్ పంచాయతీలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాఘు, ఉపసర్పంచ్ ఫారూక్ తదితరులు చేతి గుర్తుకు ఓటువేసి కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డిని గెలిపించాలని కోరారు.ఆరు గ్యారంటీ స్కీంలు అమలు చేసి ప్రజలను ఆదుకుంటుందని తెలిపారు. శేరితండాలో బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు.